క్లుప్తంగా

బీజేపీలో చేరిన హరినారాయణ



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో హరినారాయణ

ప్రొద్దుటూరు : యోగివేమన యూనివర్సిటీ మాజీ పాలకమండలి సభ్యుడు, శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేస్తానని ఆయన తెలిపారు. అమరావతిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

పోరుమామిళ్ల (అట్లూరు) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేట్, అసోసియేట్ కస్టమర్ కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రకాష్‌రావు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ మోహన్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా చూపుతామన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన అభ్యర్థులు అర్హులని, పోరుమామిళ్ల మండలం, పరిసర ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7013504977 నంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున బాబాకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. దారివెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. గురుపౌర్ణమి సందర్భంగా అన్నదానానికి భక్తులు కానుకలు సమర్పించారు.

పరామర్శ

అట్లూరు : గుండెపోటుతో మృతిచెందిన ఆటో డ్రైవర్ కుటుంబాన్ని శుక్రవారం మాడపూరు సర్పంచ్ శ్యామలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సగిలి శ్రీనివాసులరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పరామర్శించారు. చిన్నరాసుపల్లె గ్రామానికి చెందిన బాలరాజు శ్రీనివాసరాజు (30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామంలో వరి నాట్లు వేసేందుకు కూలీలను ఆటోలో తీసుకుని వెళ్లి అక్కడ గుండెపోటుకు గురై గురువారం మృతిచెందాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మద్దికపుల్లారెడ్డి, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో 22న సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

క్షయవ్యాధి నివారణ టీకాలు

గోపవరం : క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా మండలంలోని ఏడు ఆరోగ్య ఉప కేంద్రాల్లో క్షయవ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు టీబీ సూపర్‌వైజర్ నరసింహప్రసాద్ తెలిపారు. మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలు పైబడిన బీపీ, షుగర్ ఉన్న 60 సంవత్సరాల వారందరికీ ఈ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే 60 సంవత్సరాలు పైబడిన బీపీ, షుగర్ లేని వారు కూడా ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

దళితులకు రక్షణ కల్పించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : దళితులపై దాడులు చేయడం దారుణమని, వారికి రక్షణ కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సాత్రి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూరు గ్రామంలో గజ్జల వెంకటసుబ్బారెడ్డి చేతిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను ఆయన పరామర్శించారు. బాధితుడికి ప్రభుత్వం రక్షణ కల్పించి ఆదుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుడి దౌర్జన్యం

ప్రొద్దుటూరు : తమ స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేసి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యత్నిస్తున్నాడని మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు, చంద్రశేఖర్ శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక దందా!

- జేబులు నింపుకొంటున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



శ్రీనివాసపురం ఇసుక డంప్ వద్ద ఇసుకను తరలిస్తున్న దృశ్యం

గోపవరం : మండలంలోని గోపవరంలో ఇసుక మాఫియా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ నెల 9వ తేదీ నుంచి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా శ్రీనివాసపురం ఇసుక డంప్ నుంచి టన్ను రూ.468లు ఎంపీడీఓ పర్యవేక్షణలో మండల సమాఖ్య ద్వారా ఇసుకను విక్రయిస్తున్నారు. ఒక ఆధార్ కార్డుపై 20 టన్నుల వరకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. ముందుగా ఐకేపీ వారు ఇచ్చిన రసీదు ప్రకారం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ఇసుకను తీసుకెళుతున్నారు. డబ్బు చెల్లించిన తర్వాత టోకెన్ ఇవ్వడం జరుగుతుంది. ఒకే టోకెన్‌పై నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు ఇసుక బయటికి వెలుతోందని సమాచారం. ఒక ట్రాక్టర్‌కు 5 టన్నుల వరకు ఇసుకను లోడ్ చేస్తున్నారు. దీంతో రూ.2340 అవుతుంది. ఈ ప్రకారం ఒకే టోకెన్‌పై నాలుగైదు ట్రాక్టర్లు వెళుతున్నందున రూ.10 వేల వరకు ఒకే టోకెన్‌పై గోల్‌మాల్ జరుగుతుంది. ఇదంతా అక్కడున్న నిర్వాహకులు పంచుకుంటున్నట్లు తెలిసింది. వారం రోజులుగా ఈ తంతు కొనసాగుతుంది.

వారం రోజులుగా కొనసాగుతున్న దందా

మహిళా సమాఖ్య ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే తప్పా అక్కడ మహిళలకు బదులు వారి భర్తలు, బంధువులు పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంతే కాకుండా గత ప్రభుత్వ హయాంలో ఇదే శ్రీనివాసపురం డంప్‌లో దాదాపు 60 వేల టన్నుల మేర ఇసుక ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డంప్ నుంచి దాదాపు 50 శాతంపైగానే ఇసుకను అధికారపార్టీ నాయకులు తరలించారు. తర్వాత ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టి డంప్‌లో ఉన్న ఇసుకను ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీతో కలిసి టన్ను రూ.468 ప్రకటించడంతో పాటు గృహావసరాలకు మాత్రమే సరఫరా చేయాలని నిబంధనలు ఉన్నాయి. ఈ మేరకు మండల సమాఖ్య ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఇందులో కూడా గోల్‌మాల్ జరుగుతుండటంతో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ రాధాకృష్ణన్‌ను వివరణ కోరగా ఇసుక మాఫియా జరుగుతున్నట్లు తమ దృష్టికి ఇప్పుడే వచ్చిందని, వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు): వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలపై దాడి హేయమైన చర్య అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు పర్యటనలో భాగంగా దళితుడైన మాజీ ఎంపీ రెడ్డెప్ప స్వగృహానికి వెళ్తే టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేయడం పిరికి పంద చర్యగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా జరుగుతున్న హత్యలు దాడులు, ఆస్తుల ధ్వంసం కూల్చివేతల ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రషీద్‌ను అతి కిరాతకంగా హత్యచేయడం తదితర ఘటనలను చూస్తే ఈ రాష్ట్ర పరిస్థితి ఎక్కడికి పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మచ్చుమర్రిలో 9 ఏళ్ల బాలిక హత్యాచారం, హత్యకు గురయిందని, ఇప్పటివరకు బాలిక మృతదేహం కనిపించలేదని తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలతో నిర్వహించిన శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాజ, నాగభూషణం, శేఖర్ పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



బద్వేలు అర్బన్ : తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకటేష్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుతో శుక్రవారం బద్వేలు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు అవుతున్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబులేసు, రామ్మోహన్, అరవింద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

కలసపాడు : వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సగిలి గురయ్య, జిల్లా నాయకులు గుడిసె సుదర్శన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేయాలని, కౌలు రైతులకు కూడా పంటల బీమా పరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు చేసి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రవీణ్, హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి ఎ.రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మహబూబ్‌నగర్ సచివాలయంలో నిర్వహించిన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా గర్భిణులు, పాలిచ్చే మహిళలకు అందే ప్రయోజనాలను వివరించాలని కోరారు. అలాగే గర్భిణులు, బాలికలలో రక్తహీనత నివారణకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శరత్‌చంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, డీపీఎం నారాయణ, ఎంఎస్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డిని నియమించడం సిగ్గుచేటు

ప్రొద్దుటూరు కల్చరల్ : యోగివేమన యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా రామకృష్ణారెడ్డిని నియమించడం సిగ్గుచేటని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విద్యార్థి విభాగం రాష్ట్ర కో కన్వీనర్ హరిత అన్నారు. స్థానిక సృజన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైవీయూలో ప్రభుత్వం నూతనంగా ఇన్‌చార్జి వీసీ రామకృష్ణారెడ్డిని నియమించడం మానవతా విలువలకు ఉరితాడు వేయడమే అభివర్ణించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో రామకృష్ణారెడ్డి రిజిస్ట్రార్‌గా పనిచేసే సమయంలో లైంగిక వేధింపులు, అవినీతి అక్రమాలకు పాల్పడటంతో ఆయన పదవీకాలాన్ని కమిటీ వేసి ఏడాదిన్నరకే తొలగించారని తెలిపారు. వైవీయూలో ప్రిన్సిపాల్‌గా మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌వీఎస్ నగర కార్యదర్శి నాగరాజు, నాయకులు ప్రసన్న, వెంకటేష్, ఆనంద్, చిన్న పాల్గొన్నారు.

శ్యాంసంగ్ నూతన ఫోన్ ఆవిష్కరణ



శ్యాంసంగ్ నూతన ఫోన్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీ రోడ్డులోని నవీన్ సెల్‌పాయింట్‌లో శ్యాంసంగ్ గెలాక్సీ జెడ్46, జెడ్ ఫ్లిప్ మొబైల్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆవిష్కరించారు. శ్యాంసంగ్ కంపెనీ ప్రతినిధులు మొబైల్‌లోని ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, జిల్లా ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ బద్వేలి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు బచ్చల ప్రతాప్‌రెడ్డి, చీమల రాజశేఖరరెడ్డి, చైతన్యరెడ్డి, సెల్ పాయింట్ నిర్వాహకుడు నవీన్, శ్యాంసంగ్ జోనల్ మేనేజర్ రాజశేఖర్, ఏబీఎం సునీల్ కుమార్, డిస్ట్రిబ్యూటర్ దినేష్ కుమార్, డీలర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



డ్రైనేజీ కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శుక్రవారం అధికారులతో కలసి ప్రధాన డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. కాలువల నిర్వహణకు సంబంధించి రింగ్ రోడ్డులో ఉన్న ప్రదేశాన్ని చూసి అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.136 కోట్లతో గతంలో మంజూరైన డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులను మున్సిపాలిటీ వరకే పరిమితం కాకుండా పరిసరాల్లో ఉన్న కొత్తపల్లె, దొరసానిపల్లె, సోములవారిపల్లె పరిధిలో చేపట్టాలని నిర్ణయించామన్నారు. తద్వారా వర్షం నీరు నిల్వ కుండా డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దుతామని తెలిపారు. పాత మార్కెట్‌లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు స్థానంలో కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ ప్రారంభం

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ గర్ల్స్ హాస్టల్‌ను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.భరత్ కుమార్, ఏబీసీడబ్ల్యూఓలు కృష్ణయ్య, నాగేంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుందూను నమ్ముకొని.. దేవుడిపై భారం వేసి



టంగుటూరులో సాగులో ఉన్న అరటి పంట

రాజుపాళెం : కుందూనదిలో వస్తున్న నీటిని నమ్ముకొని.. దేవుడిపై భారం వేసి అక్కడి రైతులు పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటిన వరుణ దేవుడు కరుణించలేదు. దీంతో పంటల సాగుకు అదును దాటిపోవడంతో రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామ రైతులు మొక్కజొన్న, పసుపు, అరటి, మిరప, పూలచెట్లు, పశువులకు గడ్డిని వేసుకున్నారు. దీంతో ఖర్చులు కూడా అధికంగానే అవుతాయన్నారు. మరి కొంతమంది రైతులు బోర్ల కింద పంటలను సాగు చేశారు. కుందూనది కింద పాడి రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు కౌలు చెల్లించి పశువులకు గడ్డిని కూడా పెంచుకుంటున్నారు. కుందూతీరంలో పంటలు సాగు కాగా.. మెట్ట భూములు సాగుకు నోచుకోలేదు.



టంగుటూరు వద్ద కుందూనదిలో పారుతున్న నీరు



సాగులో ఉన్న పూల చెట్లు

కేజీబీవీ పాఠశాల సందర్శన

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జెడ్పీటీసీ సభ్యులు ముత్యాలప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సి.బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధన, ఉపాధ్యాయులకు మెను ప్రకారం అందాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించారు.

శాకంబరీ దేవిగా వాసవి మాత

మైదుకూరు : ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా మైదుకూరులోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవిమాతను కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి రంగురంగుల కొత్త చీరలతో అలంకరించి పూజలు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన చైతన్య మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటీ

ప్రొద్దుటూరు : స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం చైతన్య మున్సిపల్ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడుగా శ్రీనివాసులరెడ్డి, గౌరవ సలహాదారులుగా మురళీప్రసాద్, నాగేంద్ర, అధ్యక్షుడుగా ఎస్.అరుణ్, కార్యదర్శిగా జి.ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా ఆగమణి, ఎస్.బాబు, సాగర్, ఉపాధ్యక్షులుగా ఐజీ సులోచనమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్, వినోద్ కుమార్, పవన్ కుమార్, సయ్యద్ బాషా, కె.రాజశేఖర్, నారాయణ, సుధాకర్‌ను ఎన్నుకున్నారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య నాయకుడు కొండారెడ్డి, కవి మహమూద్ పాల్గొన్నారు.

ఏరువాక గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అభిషే కాలు పూజలు నిర్వహించారు. అమ్మవారిని అ న్ని రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులకు ఆల య కమిటీ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమంను నిర్వహించారు.

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం

ఖాజీపేట : కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ ముబిన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ, స్థానిక వైద్య సిబ్బందితో అవగాహనా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పాదాలు, చేతివేళ్లు తిమ్మిర్లు వంటి లక్షణాలుంటాయని పేర్కొన్నారు. లెప్రసీ వ్యాధిని ఎండీటీ ద్వారా నివారించవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

బి.కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. కెజీబీవీ ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, సర్పంచ్ గురవయ్య, పోరుమామిళ్ల మండల ఉపాధ్యక్షులు సి.బాషా, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

పోరుమామిళ్ల (అట్లూరు) : మండలంలోని కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాల, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు.

పెట్రోలు బంక్ స్థలాన్ని పరిశీలించిన జేసీ

దువ్వూరు : దువ్వూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న పెట్రోలు బంక్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పరిశీలించారు. ఎన్నికలకు ముందు పెట్రోలు బంక్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని, ఎన్నికల కారణంగా పనులు ముందుకు సాగలేదని జేసీ తెలిపారు. నివేదికను త్వరగా తయారు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, దువ్వూరు తహసీల్దార్ ఉమారాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి

దువ్వూరు : దువ్వూరులోని మైదుకూరు–ఆళ్లగడ్డ రహదారిపై నిర్మాణాలు తొలగించేందుకు రెవెన్యూ శాఖ హద్దులు ఏర్పాటు చేసి ఇవ్వాలని మైదుకూరు ఆర్‌అండ్‌బీ ఏఈఈ రజియాబేగం దువ్వూరు తహసీల్దార్ ఉమారాణికి శుక్రవారం లేఖ అందజేశారు. ఏఈఈ రజియా బేగం మాట్లాడుతూ దువ్వూరు సెంటర్ నుంచి దేవాన్ష్ కల్యాణ మండపం వరకు రోడ్డుకు ఇరువైపులా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు.







